క్లుప్తంగా

చిన్నారులకు నివాళి



చిన్నారులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పోతారం గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మృతుల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదివే మన్నె సహస్ర, 3వ తరగతి మన్నె సాన్వి ఉన్నారు. అకాల మృతి చెందిన విద్యార్థుల ఆత్మకు శాంతి కలగాలని సోమవారం తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించి, కొవ్వొత్తులు వెలిగించారు. తరగతి గదుల్లో చురుకుగా ఉండి క్రమశిక్షణతో విద్యనభ్యసించే ఇద్దరు చిన్నారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విచారకరమని హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు మాధవి, షర్మిల, రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.

లెక్కలు కచ్చితంగా రావాలి



విద్యార్థులతో బోర్డుపై రాయిస్తున్న ఎంఈఓ

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం, లెక్కలు కచ్చితంగా రావాలని ఎంఈఓ బాలరాజు అన్నారు. మండలంలోని కొత్తచెరువుతండా ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరీను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో బోర్డుపై అక్షరాలు రాయించి చదివించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు



నార్సింగి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంతో పాటు మండలంలోని భీమ్‌రావుపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములకు బోర్డులను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. నార్సింగి తహసీల్దార్ షేక్ కరీం ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ భూముల్లో సర్వే నంబర్‌తో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నార్సింగి మండల కేంద్రంలోని సర్వేనంబర్ 464లో 0.15 గుంటల ప్రభుత్వ భూమి, భీమ్‌రావుపల్లి గ్రామంలోని సర్వేనంబర్ 170ఏ లో 3.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వీరశైవులంతా ఏకతాటిపైకి రావాలి



సమావేశంలో పాల్గొన్న వీరశైవులు

అల్లాదుర్గం(మెదక్): వీరశైవలింగాయత్ కులస్తులందరూ ఏకతాటిపైకి రావాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనలో వీరశైవ లింగాయత్, లింగబలిజగా రాయించాలని వీరశైవలింగాయత్ లింగబలిజ రాష్ట్ర కేంద్ర కమిటీ సభ్యుడు శివశరణ అన్నారు. సోమవారం చిల్వెర ఐబీ చౌరస్తాలో కులగణనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వీరశైవ కులస్తులు ప్రభుత్వం నిర్వహించే సర్వేలో కులం పేరు వీరశైవ లింగాయత్/లింగబలిజ అని రాయించాలన్నారు. రాష్ట్రంలో వీరశైవలింగాయత్‌లు 40 లక్షల పైనే జనాభా ఉన్న ఒక్కొక్కరు ఒక్కోలా కులం పేరు రాయించడంతో ప్రభుత్వ రికార్డులో 60 వేలపై జనాభా ఉన్నట్లు గుర్తించామన్నారు. కార్యక్రమంలో సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, ధనుంజయ్య, మధు, రాకేశ్, రఘు, పరమేశ్వర్, చెన్నప్ప, వీరన్న, సంగమేశ్వర్ స్వామి, మనోహర్, బసప్ప, శేఖర్, విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనేదెన్నడో..?

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- పట్టనట్లు వ్యవహరిస్తున్నఅధికారులు



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు



గడిపెద్దాపూర్‌లో మొలకెత్తిన ధాన్యం చూపిస్తున్న రైతులు

అల్లాదుర్గం(మెదక్): కొనుగోలు కేంద్రాలను అధికారులు తూతూమంత్రంగా ప్రారంభించారు కానీ ధాన్యం కొనుగోలు చేయడం లేదు. అకాల వర్షాలకు ధాన్యం రాశులు తడిసి, మొలకెత్తున్నాయి. అల్లాదుర్గం మండలంలో 15 రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం వద్ద రైతులు కాపాల ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని సీతానగర్, రాంపూర్, గడిపెద్దాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అక్టోబర్ 17న గడిపెద్దాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. గడిపెద్దాపూర్ తండా రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 15 రోజులు అవుతున్నా.. కొనుగోలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంపూర్, గడిపెద్దాపూర్ కేంద్రాల వద్ద శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసింది. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

న్యాయం చేయాలి



వరి ధాన్యం విక్రయించేందుకు 10 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తేచ్చాం. వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. కొనుగోలు చేస్తే ఈ దుస్థితి వచ్చేది కాదు. మొలకెత్తిన ధాన్యం కొనేందుకు మెలిక పెడతారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

–బాబానాయక్, గడిపెద్దాపూర్ తండా

ధాన్యం కొనడం లేదు



కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తూకం వేయడం లేదు. ఎప్పుడు కొంటారో తెలియడం లేదు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎవరు ఉండటం లేదు. గిరిజనులం కావడంతో అధికారులు, కొనుగోలు సిబ్బంది చిన్న చూపు చూస్తున్నారు. ధాన్యం తెచ్చి 15 రోజులు అవుతోంది.

–మీరిబాయి , గడిపెద్దాపూర్ తండా

దళారులను నమ్మి మోసపోవద్దు

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



నార్లాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

నిజాంపేట(మెదక్): ఆరుకాలం కష్టించి పండించిన పంటను దళారులను నమ్మి తక్కువ ధరలకు విక్రయించొద్దని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ఈ మేరకు నార్లాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. సన్న రకానికి రూ. 500బోనస్ ప్రకటించిన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమరసేనారెడ్డి, మహేందర్, నాగరాజు, నసీరొద్దీన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దనూరలో..

టేక్మాల్(మెదక్): మండలంలోని దనూరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామాల్లోని రైతులు వరి కొనుగొలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, సత్యం, పాపయ్య, మాజీ సర్పంచ్ గౌతంరాజ్, పీఏసీఎస్ సీఈఓ శివకృష్ణ, ఎంఈఓ ఇంద్రయ్య, నాయకులు మాన్‌కిషన్, సుధాకర్, శ్రీధరచారి, మోహన్, రవి, మల్లేశం ఉన్నారు.

రైతులను ఆదుకుంటాం

అల్లాదుర్గం(మెదక్): రైతులను ఆదుకునేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముస్లాపూర్, రెడ్డిపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వెంటనే తేమ చూసి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఎంపీడీఓ చంద్రశేఖర్ కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం, మండలాధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు సురేశ్‌గుప్తా, నర్సింహారెడ్డి, నర్సింలు, వెంకట్, పీఏసీఎస్ సీఈఓ శివగౌడ్, నాగయ్య, మాజీ సర్పంచ్‌లు మల్లేశం, పోచయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలోనే పత్తి విక్రయించాలి

అల్లాదుర్గం(మెదక్): దళారులను నమ్మి మోసపోవద్దని, సీసీఐ కొనుగోలు కేంద్రంలోనే పత్తి విక్రయించాలని సీసీఐ అధికారి శక్తివేలు అన్నారు. మండల పరిధిలోని చెవెళ్ల పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి క్వింటాల్‌కు మద్దతు ధర సీసీఐ కొనుగోలు కేంద్రంలో రూ.7521 ఉందన్నారు. కార్యక్రమంలో వట్‌పల్లి మార్కెట్ కమిటీ కార్యదర్శి సునీల్, పత్తి మిల్లు నిర్వాహకులు రమేశ్, పురం కిషోర్, నాగయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి



నర్సాపూర్‌లో మంత్రి దామోదరకు వినతిపత్రం అందిస్తున్న ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధులు

నర్సాపూర్: తమకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఆశ వర్కర్లు సోమవారం నర్సాపూర్ వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. వారు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంత్రిని కలిసి మాట్లాడారు. తాము చాలా కాలంగా ప్రజలకు సేవలందిస్తున్నామని, తమకు సరైన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధులు సమంత, లత, మంజుల తదితరులు కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ విద్యుత్ సంస్థలో పని చేస్తున్న తమను రెగ్యులర్ పోస్టుల్లోకి తీసుకోవాలని మంత్రి దామోదర్‌ను కోరుతూ విద్యుత్ ఆర్టిసన్స్ కన్వర్షన్ జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాము ఆర్టిసన్స్ కార్మికులమని, తమను రెగ్యులర్ పోస్టుల్లోకి తీసుకోనందున తాము అన్ని విధాల నష్టపోతున్నామని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఇంజనీరింగు కాలేజీలో సమగ్ర శిక్షణ



మాట్లాడుతున్న కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్–బేసిక్స్ అండ్ ఇండస్ట్రియల్ అప్లికేషన్స్ అంశంపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ బిట్స్ డైరెక్టర్ డాక్టర్ జీవన్ జైడీ మాట్లాడుతూ.. సీఎఫ్‌డీ సాధనం అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. దానిని నేర్చుకోవడంతో మెకానికల్, కెమికల్ ఫార్మా విభాగాలకు చెందిన విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమం ఈనెల 9 వరకు కొనసాగుతుందని కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, మెకానికల్ హెచ్‌ఓడీ వరున్, కోఆర్డినేటర్లు ఓబుల్‌రెడ్డి, పద్మారెడ్డి, మేనేజర్ బాపీరాజు, ఏఓ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నష్టపోతున్న రైతులు



కోమటిపల్లి వద్ద కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రామాయంపేట(మెదక్): అకాల వర్షాలతో ధాన్యం తడిసి, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు ఆరోపించారు. సోమవారం కోమటిపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం 15 రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి చేతులు దులుపుకోగా, ఇంతవరకు ఏ కేంద్రంలో తూకం ప్రారంభం కాలేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యంతో 15 రోజులుగా కేంద్రాల్లో తూకం ప్రారంభం కాలేదని, దీంతో అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టానికి గురయ్యారని తెలిపారు. రైస్‌మిల్లర్లకు కోటా కేటాంచకముందే కేంద్రాలు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే, త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోర్చా జిల్లా కార్యదర్శి రమేశ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేఖర్, పార్టీ పట్టణాధ్యక్షుడు భానుచందర్, మోర్చా మండలాధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



హరీశ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లిలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బక్కొల్ల హరీశ్ గత నెల 13న డబ్బుల విషయంలో ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడు. పలుచోట్ల బంధువులు, స్నేహితుల ఇళ్లలో వేతికిన ఆచూకీ లభించకపోవడంతో హరీశ్ భార్య మహేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి: శశిధర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): త్వరలో జరగబోయే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు ఇవ్వాలని కోరుతూ భారత ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ ఆర్టికల్ 171 ప్రకారం ఏర్పడిన శాసన మండలిలో తమ సమస్యలు పరిష్కరించుకొనుటకు ప్రతీ ఉపాధ్యాయుడికి ఓటు హక్కు ఉండాలన్నారు.

సీపీఎం జిల్లా నూతన కార్యదర్శిగా నర్సమ్మ



మెదక్ కలెక్టరేట్: సీపీఎం పార్టీ జిల్లా నూతన జిల్లా కార్యదర్శిగా కడారి నర్సమ్మ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం మెదక్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 2, 3 తేదీల్లో తూప్రాన్ పట్టణంలో పార్టీ జిల్లా 15వ మహాసభలు జయప్రదంగా ముగిసినట్లు తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా 15 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారన్నారు. నూతన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా మల్లేశం, మల్లేశం, బస్వరాజు, మహేందర్ రెడ్డి, బాలమణి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా నాగరాజు, బాగయ్య, సంతోష్, మల్లేశం, అబ్బాస్, అనుష, ప్రవీణ్‌కుమార్, అజయ్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

నిబంధనలతో సర్వే చేయాలి



నర్సాపూర్: సామగ్రి అందిస్తున్న అధికారులు



తూప్రాన్: మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

నర్సాపూర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో విధులు కేటాయించిన ప్రతీ ఒక్కరు నిబంధనలతో సర్వే చేయాలని ఎంపీఓ శ్రీనివాస్, ఎంఈఓ తారాసింగ్ సూచించారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వే విధులకు ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే చేపట్టాలని చెప్పారు. ఈనెల 6 నుంచి 8 వరకు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించాలని, 9 నుంచి సర్వే చేపట్టాలన్నారు. శిక్షణ అనంతరం వారికి సర్వే కోసం అవసరమైన సామగ్రిని అందజేశారు.

ప్రతీ ఇంటిని సర్వే చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ సింధూజ అన్నారు. సోమవారం ఆమె మండల అధికారులతో కలిసి, చిలప్‌చెడ్ రైతువేదికలో ఉపాధ్యాయులు, కార్యదర్శులకు సమగ్ర సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఈనెల 6, 7, 8 తేదీల్లో ఎన్యూమరేటర్లు సర్వే చేయాల్సిన గ్రామాల్లో ప్రతీ ఇంటికి స్టిక్కర్ వేసి, వారి వివరాలు తీసుకొని, సర్వేకు వచ్చే తేదీ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విఠల్, ఎంపీడీఓ ఆనంద్, ఆర్ఐ సునీల్, ఏపీఓ శ్యామ్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు

నిజాంపేట(మెదక్): సమగ్ర కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు ఎంపీడీఓ రాజిరెడ్డి ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులకు 112 అంశాలపై అవగాహన శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో మండల ఎంపీఓ ప్రవీణ్, ఆర్ఐలు ప్రీతి, ఇమాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా నిర్వహించాలి

చిన్నశంకరంపేట(మెదక్): సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఉపాధ్యాయులు జాగ్రత్తగా నిర్వహించాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. సోమవారం చిన్నశంకరంపేట రైతువేదికలో ఉపాధ్యాయులకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వేలో పూర్తి వివరాలు నమోదు చేయాలని కోరారు. ఆధార్ నంబర్‌తో పాటు రేషన్‌కార్డు నంబర్, ధరణి పాస్‌బుక్ నంబర్‌తో పాటు కుటుంబ వివరాలు, వారి నేపథ్యం నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఏఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ గిరిజారాణి పాల్గొన్నారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తప్పులు లేకుండా చేయాలని తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. కౌడిపల్లి రైతువేదికలో ఉపాధ్యాయులకు ఇంటింటి కుటుంబ సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే ప్రణాళికతో కుటుంబ సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, ఎంఈఓ బాలరాజు పాల్గొన్నారు.

తూప్రాన్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు, ఉపాధ్యాయులు తప్పులు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం మాదక ద్రవ్యాలు వినియోగించడం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయులు, పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. క్షణికానందం కోసం మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను అంధకారం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ నుంచే చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రమశిక్షణతో విద్యనభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ మల్లేశం, ఏఎస్ఐ నర్సింహమూర్తి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మానవ హక్కుల ఫెడరేషన్ మండలాధ్యక్షుడిగా పవన్



టేక్మాల్(మెదక్): మానవ హక్కుల ఫెడరేషన్ మండలాధ్యక్షుడిగా పవన్‌ను సోమవారం మహాసేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఎన్నుకొని నియామకపత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండలాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు అనిల్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో ఎక్కడ ఏ సమస్యలు జరిగిన వెంటనే హ్యుమెన్ రైట్స్ ఫెడరేషన్ స్పందిస్తుందని, ప్రజల కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఆల్ ఇండియా రీజినల్ డైరెక్టర్లు రాంబాబు, అంజలి, మెదక్ జిల్లా అధ్యక్షుడు నర్సింలు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింలుకు ధన్యవాదాలు తెలిపారు.

◆ కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ

పెద్దశంకరంపేట(మెదక్): కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం శివాయిపల్లికి చెందిన దండు సాయిలకు రూ.33 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు, ముసాపేటకు చెందిన మొగులమ్మ కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల బ్యాంకు ఓచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎంపీపీ శ్రీనివాస్, కోణం అంజయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు యాదుల్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

నర్సాపూర్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యానికి ఆర్థిక సాయం అందుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌కు చెందిన పోచమ్మకు రూ.లక్ష ఎల్‌ఓసీ అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు మల్లేశ్, లక్ష్మీకాంతారావు తదితరులు ఉన్నారు.

◆ మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

వెల్దుర్తి(తూప్రాన్): పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్‌తో సోమవారం హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నా నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ధర్మారం మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, భస్వాపూర్ మాజీ సర్పంచ్ మల్లేశంగౌడ్, ఎం.జలాల్‌పూర్ మాజీ సర్పంచ్ భర్త కృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

పాపన్నపేట(మెదక్): మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగన్నాథంను గచ్చిబౌలీ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు ముఖ్యమంత్రిని కలిసేందుకు వెళ్తున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు హైదరాబాద్ కొండాపూర్ గచ్చిబౌలీలో పోలీసులు అరెస్టు చేసినట్లు జగన్నాథం తెలిపారు.

◆ మూఢ నమ్మకాలపై అవగాహన

పాపన్నపేట(మెదక్): మూఢ నమ్మకాలపై అవగాహన పెంచుకోవాలని విజ్ఞాన ప్రతినిధి నరేశ్ అన్నారు. సోమవారం పాపన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూఢనమ్మకాలపై ప్రయోగాల రూపంలో విద్యార్థులకు తెలియజేశారు. జీవిత లక్ష్యాల కోసం విద్యార్థులు బాగా చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సింలు, ఎఎస్ఐ సంగన్న, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ తూకం వేయకుంటే రహదారి దిగ్బంధం



కొల్చారం(నర్సాపూర్): రెండు రోజుల్లోగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయకుంటే మెదక్–సంగారెడ్డి ప్రధాన రహదారిని దిగ్బంధం చేస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం మండలంలోని సంగాయిపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడారు. వరి కోతలు కోసి 20 రోజులు అవుతున్నా.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చెయ్యకపోవడం, అకాల వర్షాలతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతూ అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా యంత్రాంగం మాత్రం ధాన్యం తూకం ప్రారంభించడంలో తీవ్ర అలసత్వానికి పాల్పడుతుందని ఆరోపించారు. ఈ విషయంలో అధికారులు తక్షణమే ధాన్యం కొనుగోలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంజీవయ్య, రైతులు దేవయ్య, లక్ష్మయ్య భూమయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

◆ కొప్పోల్ ఆలయంలో భక్తుల పూజలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో అన్నపూజ, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.